# సకల వేద విజ్ఞానసారమే సనాతన ధర్మము

సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
విద్యలన్నియు నేర్చి విలువ సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
దానధర్మాల సార్థకత సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
పదవులనేలిన ఫలము సున్న
సత్య ధర్మ ప్రేమ శాంతులు లేకున్న
బహుళ సత్కార్యలాభంబు సున్న
మన సనాతన ధర్మ హర్మ్యంబు నిలుప
గుణములివి నాల్గు పునాదిగోడ లప్వ
ఇంతకన్నను వేరెద్ధి యెరుకపరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార

దివ్యాత్మ స్వరూపులారా!

సకల వేద విజ్ఞానసారమే సనాతన ధర్మము. భారతీయ తత్త్వజ్ఞానమునకు, ధార్మిక సిద్ధాంతమునకు, సంస్కృతీ సాంప్రదాయములకు ఈ సనాతన ధర్మమే మూలము. తెలుసుకొనవలసిన విషయము తెలుసుకొనునంతవరకు వదలవలసినటువంటి బాధ్యతలు వదలనంతవరకు, చేరవలసిన గమ్యము చేరునంతవరకు ఈ జీవితము నిర్విరామముగా సాగిపోతుంటుంది.

వదలవలసిన దానిని వదలినంత
తెలియవలసిన దానిని తెలిసినంత
చేరవలసిన దానిని చేరినంత
కలుగు ఆనందమిదియని తెలుపవశమె

sri sathyasai vachanamrutam

**వదలవలసినది ఈ జగత్ భావములను**
**తెలియవలసినదీ జీవ దివ్యతత్త్వము**
**అరుగవలసినదే బ్రహ్మపదచరణము**
**కలుగు ఆనందమిదియని తెలుప తరమా!**

**భూత భవిష్యద్వర్తమానములకు అతీతమైనదే సత్యము**

నిర్వేదముతో కూడినటువంటి ఈ జీవితమునకు, పవిత్రతత్త్వము బోధపడినంతమాత్రముచేతనే వేదముగా మారి దివ్యత్వము పవిత్రతతో ఆవిర్భవిస్తుంది. అదియే వేదము. వేదమనగా తెలివి, ఎరుక, వివేకము అని చెప్పవచ్చును. తన యునికిని తాను గుర్తించి, అండదండలుగా వుండినటువంటి చరాచర ప్రపంచమునకు, తనకు వుండినటువంటి సంబంధబాంధవ్యమును గుర్తించి వర్తించుట. ఇది వేద వాఙ్మయము అందించినటువంటి ప్రసాదమే! ఇదియే వివేకము, విజ్ఞానము. జ్ఞానము అనంతము. సత్యమును చూపునదే జ్ఞానము. భూతభవిష్యత్‌వర్తమానకాలములకు అతీతమైనటువంటిదే సత్యము. సత్య జ్ఞానములు రెండుకూడ అనంతములు. అంతములేని వీటికి ఆదికూడ లేదనియే చెప్పవచ్చును. ఆద్యంతరహితమైన సత్య, జ్ఞానములతో ముడిపడినటువంటిదే వేదము. వేదముకూడ ఆద్యంతరహితమైనదే! ఇట్టి జ్ఞానమయమైనటువంటి వేదమును వాఙ్మయముగా భావించుటయే మానవత్వము. ఇది ఆచరణ నిమిత్తమైనటువంటిదే కాని ఆరాధన నిమిత్తమైనటువంటిది కాదు.

అనాదికాలమునుండి భారతదేశమందు మహర్షులు ఈ సత్యము గుర్తించి వర్తించటంచేతనే ఈనాటికికూడనూ ఈ పవిత్రత జగత్ వ్యాప్తిగావించుచూ వస్తున్నది. ఈ మహర్షులయొక్క పలుకులే, వాక్యములే మంత్రములుగా మారినవి. వారు ఆచరించినటువంటి కర్మలే క్రతువులుగా మారినవి. ఆనాడు వారు ప్రార్థించినటువంటి ప్రార్థనలే గానముగా రూపొందినవి. ఏతావాతా వాక్కే ఋగ్వేదమనియు, మనస్సే యజుర్వేదమనియు, ప్రాణమే సామవేదమనియు నిరూపించవచ్చును. "సర్వమ్ వేదమయం జగత్". ప్రపంచమునందలి ప్రతి అణువునందును, ప్రతి కణమునందును ప్రచ్ఛన్నముగా వ్యాపించినటువంటి పరతత్త్వమును చిన్నచిన్న మాటలతో విడివిడిగా

srisathyasaivachanamrutam

వివరించినటువంటిదే వేదము. ప్రపంచములో మానవజాతి అభ్యుదయమునకు, శ్రేయస్సుకు, ప్రేయస్సుకు అర్హమైనటువంటి మంత్రచర్యలను పఠింపజేసి, అందించి, ఆనందించి, అభివృద్ధి గావించినటువంటిదికూడను వేదమే.

**కర్మాచరణచేతనే చిత్తశుద్ధి ప్రాప్తిస్తుంది**

దేహము ద్వైతము. ఆత్మ అద్వైతము. దేహబుద్ధి క్షీణించినప్పుడే ఆత్మ దీప్తి రాణిస్తుంది. దేహమునకు సేకరణ సహజము. ఆత్మకు అనుగ్రహణ నైజము. ఉపాధి ఉపశమించినంతనే సమాధి మనకు ప్రాప్తిస్తుంది. సమాధి ప్రాప్తించినప్పుడే మనకు పరతత్త్వము బోధపడుతుంది. ఈ సమాధియే సాధకుని పరమావధి. కొంతకాలము తనది అని విశ్వసించినటువంటి తనువు తనది కాదనేటువంటి వివేకము యేనాడు గుర్తించునో ఆనాడే పరతత్త్వములో ప్రవేశిస్తుంది. కర్మకు పరమావధి జ్ఞానము. జ్ఞానమునకు ఆధారము కర్మ. కర్మ జ్ఞానములయొక్క సమన్వయమే సేవ. కనుకనే "చిత్తస్య శుద్ధయే కర్మః". కర్మాచరణచేతనే చిత్తశుద్ధి మనకు ప్రాప్తిస్తుంది. చిత్తశుద్ధివలననే ఆత్మానందము లభిస్తుంది. ప్రతిమానవుడు చేయవలసినటువంటి కర్మలు విధిగా చేయక తప్పదు. మంచి మనస్సుతో మంచికార్యములు ఆచరించవలసివస్తుంది. అయితే ఈ ఫలము నా కర్మలద్వారానే ఫలించినదనేటువంటి అభిమానము మంచిది కాదు. నేను చేసిన కర్మయొక్క ఫలితము నేనే అనుభవించాలనేటువంటి ఆసక్తి కూడను తగినటువంటిది కాదు. ఆచరణయందు అహంకారము, ఆసక్తియందు అభిమానము వీడినప్పుడే త్యాగము, భోగము రెండూ ఒక్కటిగానే రూపొందుతాయి.

**కర్మసన్యాసమనగా కర్మలు త్యజించటముకాదు, కర్మఫలమును త్యజించుట**

కనుకనే గీతాచార్యుడుకూడను కర్మలోని అకర్మను, అకర్మలోని కర్మను దర్శించినటువంటివాడే 'యోగి' అని నిరూపించాడు. ఐదవ అధ్యాయములో కర్మసన్యాసమనేటువంటి విషయమునందు కర్మను త్యజించటము ప్రధానము కాదు, ఆచరించినటువంటి కర్మల ఫలితమును త్యజించటము ప్రధానమని బోధించినాడు. కేవలము భౌతికముగా ఆచరించేటువంటి క్రియలనే మనము కర్మలుగా భావిస్తున్నాము. కానీ, గీతాచార్యుని భావము అట్టిదికాదు. వారివారి దేహములే కర్మ. సన్యాసిగానీ,

సంసారిగానీ దేహమును ధరించినపుడు కర్మలతో కూడివస్తున్నాడు. కనుక, కర్మస్వరూపమైన దేహమునందు ఆత్మను దర్శించటము, ఆత్మయందు సర్వభూతములను దర్శించటము. ఇదియే అకర్మలోని కర్మ, కర్మలోని అకర్మ. ఈ జగత్తులోని భోగభాగ్యములు యేకొందరి నిమిత్తమో యేర్పడినటువంటివి కాదు. ప్రతి మానవునకు తనయొక్క బాధ్యతగా ఆచరించవలసినటువంటి కర్మలు అనేకములున్నవి. బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్తము, సన్యాసము-యీ స్థానములకు, యీ భావములకు అనుగుణముగా నడచుకోవలసినటువంటి కర్మలు అనేకముగా వున్నాయి.

తమయొక్క స్థితికి, మతికి, గతికి, సద్గతికి చేయవలసినటువంటి కర్మలు అనేకములుగా వున్నాయి. ఇందులో ప్రదానమైనటువంటిది దైవశాసనము. ఈ శాసనముచేతనే వర్షములు కురియుచున్నవి. వాగులు, నదులు ప్రవహించుచున్నవి. పంటలు పండుచున్నవి. సూర్యుడుదయిస్తున్నాడు. చంద్రుడు ప్రకాశించుచున్నాడు. ఇవన్నియు అందరి నిమిత్తమై ఏర్పడినటువంటివే గానీ కేవలము యేకొద్దిమంది నిమిత్తమై ఏర్పడినటువంటివి మాత్రము కాదు. పార్థివభోగాన్ని, భాగ్యాన్ని ప్రతిప్రాణికూడ అనుభవించుటకు అధికారమున్నది. అయితే ఇందులో స్వ, పర అనేటటువంటి భేదములు విసర్జించి, సర్వత్ర దైవత్వాన్ని విశ్వసించి అనిత్య, అశాశ్వత, అసత్యమైనటువంటి జగత్‌భావములు విస్మరించి యేకాత్మ భావమును అనుభవించటమే ప్రధానమైటువంటి సత్యమార్గము. తమ నిమిత్తమై తాము ఆచరించేటువంటి కర్మలు కేవలము కర్మజీవి ఆచరించునవి.

**లోకకల్యాణ నిమిత్తమై ఆచరించే కర్మలు జ్ఞానికి సంబంధించినవి**

లోకకల్యాణ నిమిత్తమై ఆచరించు కర్మలు జ్ఞానికి సంబంధించినటువంటివి. జ్ఞానాజ్ఞానముయొక్క సమన్వయమును గుర్తించటానికి చక్కగా ప్రయత్నము చేయాలి. దేహాభిమానమును త్యజించి, ఆత్మాభిమానమును అభివృద్ధిపరచుకొని, అహంకారమును నిర్మూలము గావించటమే నిజమైన త్యాగము. ఇది సన్యాసికిగాని, సంసారికిగానీ సహజమైనటువంటిది. కనుక ఇట్టి పవిత్రమైనటువంటి చరిత్రలు ఈనాడు ఆవిర్భవింపచేసుకోవాలి. ఇందులో వుండినటువంటి తత్త్వజ్ఞానాన్ని అర్థము చేసుకోవాలి. ఒక విత్తనమును భూమిలో నాటుతాము. అది మొక్కగా అభివృద్ధిగాంచి, వృక్షముగా



sri sathyasaivachanamrutam

తయారై, అందులో వున్నటువంటి కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు, కాయలు, పండ్లు మనకు వివిధ నామరూపములుగా గోచరించినప్పటికీ, ఇవన్నికూడను ఒక్క విత్తనముండి ఆవిర్భవించినవే. ఇదే సత్యము. ఇదే నియమము. ఇదే ఆత్మ. ఇదే తత్త్వమసి.

ఒక నది ప్రవహించి అది సముద్రములో చేరుతుంది. సూర్యరశ్మికి సముద్రములోని జలము ఆవిరిగా మారి మేఘములుగా రూపొందుతుంది. మేఘములనుండి వర్షబిందువులు రాలుతాయి. ఈ వర్షములే వాగులు వంకలుగా రూపొందుతాయి. ఈ వంకలయొక్క చేరికయే నదీ ప్రవాహముగా మారుతుంది. అయితే, ప్రవాహమునకు ఈ జలము తనది అని తెలియదు. నదిలోని జలము, మేఘములలోని జలము, వర్షములోని జలము, ప్రవాహములోని జలము అంతయు ఒకటే! ఇదియే సత్యము. ఇదియే నియమము. ఇదియే ఆత్మ. ఇదియే తత్త్వమసి.

## సర్వవ్యాపియైన దివ్యతత్త్వమును గుర్తించి వర్తించటానికి చేయు ప్రయత్నమే సాధన

కొన్ని నిత్యజీవితములో అనుభవించేటువంటి ఆదర్శములు. కొంత లవణము తీసుకొని జలములోవేస్తాము. కొంతసేపటికి ఆ లవణము జలములో సర్వత్ర కరగి వ్యాపించిపోతుంది. ఈ లవణము సర్వత్రవ్యాపించినప్పటికి కంటికి కనిపించదు. చేతికి చిక్కదు. కానీ, లేదని చెప్పుటకు వీలుగాదు. దానిని జిహ్వాపై వేసుకున్నప్పుడే దాని రుచి మనకు గోచరమవుతుంది. సర్వత్ర వ్యాపించినదే అయినప్పటికీ, కంటికి కనుపించక, చేతికి చిక్కకుండా వున్నంతమాత్రమున లేదని భావించరాదు. ఈ సర్వత్ర వ్యాపించినటువంటి రుచియే నీవు. అదియే ఆత్మ. అదే సత్యము. అదే తత్త్వమసి.

జాగ్రదవస్థయందు మానవుడు అనేకవిధములైనటువంటి అనుభూతులను అనుభవిస్తాడు. అనేక విధముల సంబంధబాంధవ్యములు కల్పించుకుంటాడు. సుఖదుఃఖములను, గౌరవమర్యాదలను అందుకుంటాడు. కానీ, స్వప్నావస్థయందు ఇవన్నీ శూన్యములవుతాయి. ఈ స్వప్నమందు తనను తానే సృష్టించుకుంటాడు. తన సుఖదుఃఖములనుకూడ తానే సృష్టించుకుంటాడు. తన భయభ్రాంతులను తానే సృష్టించుకొని తానే అనుభవముపొంది ఈ భయభ్రాంతులకు గురౌతాడు. సుషుప్తిస్థితియందు తాను ఆత్మలో లీనమై అనంతమైనటువంటి తత్త్వాన్ని అనుభవిస్తాడు. అయితే జాగ్రతయందు అనుభవించినటువంటి వాడూ తానే, స్వప్నావస్థయందు అనుభవించినటువంటివాడూ తానే,

sri sathyasaivachanamrutam

సుషుప్తియందు ఆనందాన్ని అనుభవించినదీ తానే! ఇదే త్రికూట స్థాయియందు వుంటూ వుంటాడు. ఇదియే సత్యము. ఇదియే నీవు. ఇదియే ఆత్మ. ఇదియే తత్త్వమసి.

కనుక సర్వత్రావ్యాపించినటువంటి శక్తిసామర్థ్యములను మనము గుర్తించి వర్తించుకోవటానికి ప్రయత్నము చేయటమే సరియైన సాధనము. మనము అందాన్ని చూచి ఆనందిస్తాము. ఆహారాన్నిచూచి ఆహ్లాదిస్తాము. పరిమళాన్ని ఆఘ్రాణించి పరవశిస్తాము. ఇవన్నియును దేహము చేయుచున్నదా, ఆత్మ చేయుచున్నదా? ఇవన్నీ ఆత్మకు సంబంధించినవే కానీ, దేహమునకు సంబంధించినటువంటివి కాదు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహినిరామయుండు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహనిబంధబంధనల ముద్రలు లేవు నిజంబు చూడ నా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ నాత్మ రూపుడౌ.**

ఇలాంటి ఆత్మతత్త్వాన్ని మనము అన్వేషణ జరపాలి. దీనిని అనుభవించాలి, ఆనందించాలి, పెంచాలి, పదిమందికి పంచాలి. అదే ఈనాడు చేయవలసినటువంటి ప్రధానకర్తవ్యము. ఇట్టి ఆత్మతత్త్వాన్ని అనుభవించి, ఆనందించి, ఇతరులకు అందించే నిమిత్తమై ఏర్పడినటువంటివే, ఈ ఆశ్రమాలు.

**తనకు తాను తరించుకోవటం గొప్పకాదు, పరులనుకూడ తరింప జేయుటకు పాటుపడాలి**

ఈ సాధుసమాజము యేనిమిత్తమై యేర్పడినటువంటిదనే సత్యాన్ని మనము ఏనాటికి విస్మరించరాదు. దీనిని ఆధారము చేసుకొనియే దీనికొరకు జీవితాన్ని అంకితము గావించి, స్వార్థమును త్యజించి, పరార్థమును వరించి, జీవితాన్ని తరింపచేసుకోవటమే సాధుత్వములో వున్నటువంటి యథార్థము.

**వ్యక్తి మోక్షమును కోరుట స్వార్థమగును**
**తాను గమ్యమును జేరుట ధర్మమగున?**
**పరులగమ్యము గోరుటే పాటియగును**
**యిట్టి మనుజుడే నిజమైన మానవుండు**

తనకు తాను తరించుకోవటం గొప్ప తనముకాదు. పరులనుకూడను తరింపచేయటానికి

sri sathyasai vacchanamrutam

తగిన పాటుపడాలి. ఇలాంటి విశాలమైన హృదయాన్ని మనము ఈనాడు అభివృద్ధి గావించుకోవాలి. ఇలాంటి దివ్యతత్త్వాన్ని అనుభవించుటకు పవిత్రమైన భారతదేశమందు అనేకమైన ఆదర్శములున్నవి.

కానీ వాటిని గుర్తించుటకు ఈనాడు తగిన ప్రయత్నము జరగటంలేదు. సంకుచితమైన భావములచే స్వార్థమునే పరార్థముగా భావిస్తున్నారు, అనేకమంది భారతీయులు. భారతదేశమందు ఆదర్శములనందించినటువంటి వ్యక్తులు ఎందరో కలరు. ఖండఖండాంతరములయందు ఖ్యాతిగాంచినటువంటి భారతదేశముయొక్క విశిష్టతను మనము ఈనాడు తిరిగి ఆవిర్భవింపచేసి ప్రచారప్రబోధలు చేయాలి.

**ఖండఖండాంతర ఖ్యాతినార్జించిన**
**మహనీయులను గన్న మాతృభూమి**
**పాశ్చాత్య వీరుల పారద్రోలించియు**
**స్వాతంత్ర్యమునుగొన్న సమరభూమి**
**సంగీతసాహిత్య శాస్త్రీయ విద్యల**
**ధీశక్తి చూపిన దివ్యభూమి**
**చిత్రకళలతోడ చిత్రమైవున్నట్టి**
**భరతభూమియందు జననమంది**
**భరతభూమి ధర్మభాగ్యంబుకాపాడ**
**భాధ్యతంతయు మీదె భక్తులారా!**

ఇలాంటి పవిత్రమైన భారతదేశమందు మనకు జన్మము లభించటము మహాభాగ్యము. అందులో మహనీయులుగా ఉద్భవించటము మరింత భాగ్యము. అట్టి మహనీయులలో పరోపకారార్థమై తమయొక్క జీవితమును అంకితము చేసినటువంటివారు మరింత మహాభాగ్యవంతులు. ఇలాంటి పవిత్రమైన అవకాశము లభించినప్పుడు దీనిని సార్థకము చేసుకొని మనయొక్క దివ్యమైనటువంటి భారతదేశ సంస్కృతిని, ధర్మమును ప్రపంచమునకు చాటుట, యీనాడు అత్యవసరము. మన భారతదేశముయొక్క విశిష్టతను చక్కగా గుర్తించి, యితరులకు బోధించి, దానిని చక్కగా వివరింపచేయటము యీనాటి సాధువులయొక్క కర్తవ్యము.

**పరమపావనమైన భారతావనియందు**



sri sathyasai vachanamrutam

**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నింటియందు వన్నెగాంచినయట్టి**
**ఘనసత్యశీలమే కఠినతపము**

ఇలాంటి పవిత్రమైన తపస్సు మనము ఆచరించాలి. మాతృభావముకంటె మనకు ప్రధానమైనటువంటి మార్గము మరొకటిలేదు. ఇదియే శాంతము. ఇలాంటి శాంతభావముతో, సత్యవాక్కుతో, దైవచింతనతో ఆచరించి, అనుభవించి, సమాజమునకు అందించటమే మనయొక్క ప్రధానకర్తవ్యము. దివ్యమైన, పవిత్రమైన, మానవత్వము మనకు ప్రాప్తించినప్పటికిని, మనము దీనిని సరియైనటువంటి రీతిగా అర్థము చేసుకొనలేక పోవటము కేవలము దురదృష్టమే!

**త్యాగమునందే యోగము ఇమిడియున్నది**

అశాంతితో కుమిలి, కూలిపోయేటువంటి యీనాటి పరిస్థితియందు సాధువులందరు కంకణము కట్టుకొని సమాజములో ప్రవేశించి దేశమునకు త్యాగముచేసి దివ్యత్వాన్ని తగినటువంటి రీతిలో ప్రజలకు అందించాలి. "జంతూనాం నరజన్మ దుర్లభమ్" నరజన్మయెత్తినందుకు యీ మహత్కార్యాన్ని మనము సాధించాలి. ఈ పవిత్రమైనటువంటి కార్యము ఆరంభము కావటమే ఈ సమావేశముయొక్క ప్రధాన లక్ష్యము. మనము అనేక కష్టములు, నష్టములు, దుఃఖములు, నిందలు, నిష్ఠూరములు యెదుర్కొనుటకు సంసిద్ధముగా వుండాలి. ధైర్యసాహసములచేత దైవముపైన విశ్వాసము అభివృద్ధిపరచుకొని యీ కార్యములో మనము అడుగిడాలి. మన పూర్వాచారములన్నింటిని లక్ష్యమునందుంచుకోవాలి. వీటికి దేశకాల పరిస్థితుల ప్రభావము ననుసరించి కొన్నివిధములైనటువంటి మార్పులు కూర్పులుకూడా చేసుకోవాలి. ఈ మూడు దినములలోపల మనము అనేక విధములుగా సనాతన ధర్మమునకు విశిష్టత కల్పించేటువంటి అంశములను గుర్తించి, చర్చించి అభివృద్ధిపరచుకోవాలి. తుది దినము దీనికి సరియైనటువంటి రూపాన్ని రూపొందింపచేసుకోవాలి. ఏదో మన పూర్వఆచారములని చెప్పి కేవలము మూఢాచారములందే మన దృష్టిని లగ్నము చేయరాదు.

పవిత్రమైనటువంటి భగవద్గీత, ఉపనిషత్తు, బ్రహ్మ సూత్రాది గ్రంథముల యొక్క విషయాన్ని సరియైనటువంటి మార్గములో ప్రజలకు అందించాలి. ఇందు అఖండమైనటువంటి మహోన్నతమైనటువంటి ఆధ్యాత్మికతత్త్వము ఇమిడి యున్నది. ఇట్టి అమూల్యమైన శక్తివంతమైన తత్త్వాలను ఈనాడు సరియైన ప్రచార, ప్రబోధలులేక

sri sathyasai vachanamrutam

కొంచెము బలహీనము గావించుచున్నాము. అఖండమైన ఈ జ్ఞానజ్యోతిని వెలిగించి అనంతమైన ఆనందమును సమాజమునకు అందించాలి. నాస్తికత్వాన్ని రూపుమాపి సరియైనటువంటి స్థితియేర్పరచాలి. సమాజతత్వాన్ని, సాధుతత్వాన్ని గుర్తించనటువంటి వ్యక్తులు ఈనాడు సనాతన ధర్మమును అనేక విధములైనటువంటి హాస్యాస్పద స్థితికి గురిచేస్తున్నారు. మనయొక్క సత్యప్రవర్తనలు వారికి నిరూపించాలి. దివ్యమైనటువంటి సాధనాప్రక్రియలను ఈ ప్రజలలో ప్రతిష్టించాలి. శిలలనుకూడ కరిగింప చేసేటువంటి దయాప్రేమలను వెదజల్లాలి. సంకుచితమైన భావములను నిర్మూలము చెయ్యాలి. విశాలమైనటువంటి ఆత్మతత్వాన్ని అభివృద్ధి గావించుకోవాలి. ఇదే నిజమైనటువంటి తపస్సు. ఇదే నిజమైనటువంటి సాధన. కేవలము జపము, ధ్యానము, యోగము ఇత్యాది స్వార్థక్రియలు ఆచరించుకుంటూ కాలము గడుపటం మన కర్తవ్యము కాదు. ఇవి కేవలము కాలమును పవిత్రముచేయు సత్కర్మలు మాత్రమే! అన్నింటికి మించి త్యాగము చాలా అవసరము. కనుకనే "నకర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః" అని వేదము బోధించింది. ఈ త్యాగాన్ని, యోగాన్ని పూనాలి. త్యాగమునందే యోగము ఇమిడి వుంది. ఈ ఆత్మయోగమే నిజమైనటువంటి భోగము.

**అనేకత్వములోని ఏకత్వమును ప్రచారము చెయ్యాలి**

లోకములో ధనవంతులు, బలవంతులు, విద్యావంతులు, గుణవంతులు కలరు. కానీ 'ఆత్మవంతులు' అరుదుగా వుంటున్నారు. ఆత్మతత్వాన్ని గుర్తించి, ఆత్మానందమును అనుభవించినటువంటివాడే నిజమైన ఆత్మవంతుడు! అనేకత్వములోని యేకత్వమును ప్రచారము చెయ్యాలి. జాతి, మత, కుల, వర్ణ, భేదములకు యేమాత్రము కట్టుబడరాదు. సర్వమతములసారమే మనయొక్క అభిమతముగా విశ్వసించాలి. అదియే నిజమైన మతము. అదియే ఈ సాధువులయొక్క వ్రతము. ఇదియే నిజమైనటువంటి తపము. కనుక యెట్టి రాజకీయములకు అవకాశమునందివ్వక, ఎట్టి జాతి, మత, వర్ణ, భేదములకు అవకాశము నివ్వక సర్వసంగపరిత్యాగులైనటువంటి సాధువులు సమత్వాన్ని, దివ్యత్వాన్ని పవిత్రతను ప్రచారము చేస్తూ రావాలి. దీనిని యెవ్వరూ కాదనలేరు. కాదనుటకు వీలుకాదు. ఇలాంటి విశాలమైనటువంటి భావములు యీ సమావేశములో చక్కగా పెంపొందించుకుని యీనాటినుండి సమాజములో వాడవాడలు తిరిగి ప్రజలలో వుండేటువంటి అశాంతిని రూపుమాపి, శాంతిభద్రతలను యేర్పరచాలని నేను ఆశిస్తున్నాను.

srisathyasaivachanamrutham

**దైవమే మనకు కల్పవృక్షమని భావించినవారికి ఎటువంటి అశాంతి, అననుకూలములు సంభవించవు**

కానీ, దీనికి తగినటువంటి అనుకూలములు లేకపోవటంచేత అనేక మంది సాధువులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. నిజానికి దైవబలమే నిజమైన బలము. ఇట్టి దైవవిశ్వాసమును పెంపొందించుకొని సమాజములో ప్రవేశించాలి. సత్యానికి భయము లేదు. ధర్మానికి నాశనము లేదు. ప్రేమ ప్రతిఫలము ఆశించదు. ఫలితమాశించనటువంటి ప్రేమతో, భయము చెందనటువంటి సత్యముతో, దిగులొందనటువంటి ధర్మముతో యీ ధరణిలో ప్రవేశించాలి. అప్పుడే దిగ్విజయాన్ని సాధించగలము. ఈ కార్యమునకు యేవిధమైనటువంటి ఆటంకములు కలుగవు. అలాంటి విశ్వాసమే మీ శ్వాసగా భావించాలి. సన్యాసులమనగా అన్నింటిని విడచిపెట్టిన సర్వసంగపరిత్యాగులమని మనం అనుకుంటున్నాము. కాదు, కాదు. సంఘాన్ని మనము బహిష్కరించరాదు. సంఘములోనే జీవించాలి. సంఘములోనే ప్రవేశించాలి. అహంకారమును నిర్మూలనము చేసుకోవాలి. అభిమాన, మమకారములు దూరము చెయ్యాలి. సంఘములో చేరాలి. సంఘములో చేరక సాధువులు కేవలము తైలములో నీటి బొట్టువలె యేకాకిగా వుండుటకు వీలుకాదు. మనము మంచికార్యములందే పాల్గొనిన యెంతవరకునైనా తగిన సహాయసహకారములు వాటంతట అవే లభిస్తాయి. కనుక మనకు కావలసిన అనుకూలముల నిమిత్తమై మనము విచారించనక్కరలేదు. దైవమే మనసన్నిధి, సన్నిధిగా వుంటున్నప్పుడు ఈ అనుకూలముల నిమిత్తమై మనకు ఎందుకు అనవసరముగా యోచించాలి?

**కోరిన ఫలమిచ్చు కామధేనువుండ**
**ధనమిచ్చి ఆవును కొనగనేల**
**అడిగిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ**
**పెరటి వృక్షమునకై ప్రీతియేల**

దైవమే మన కామధేనువు. దైవమే మనకు కల్పవృక్షమనే విశ్వాసాన్ని దృఢము చేసుకోవాలి. అట్టి విశ్వాసము కలిగినటువంటివారికి యేనాటికీ అశాంతిగానీ, అననుకూలముగానీ సంభవించదు.

sri sathyasai vachanamrutam

**సాయికి వుండినటువంటి దూషణ, భూషణ, తిరస్కారములు లోకములో ఎవ్వరికి వుండవు**

మంచికి కొంత చెడ్డ అడ్డు తగులుతూ వుంటుంది. ఇది ప్రాకృతముయొక్క లక్షణము. దీనియొక్క నైజము. కాచినచెట్టుకే రాళ్ళదెబ్బలు. నేను అప్పుడప్పుడు అందరినికూడను 'బంగారూ, బంగారూ' అని పిలుస్తుంటాను. బంగారూ అనగా చాలా విలువైనటువంటిది. కానీ, దీనిని నగగా తయారుచేయాలంటే ఇది అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురికావలసివస్తుంది. అగ్నిలోవేసి సుత్తితో కొట్టి యెన్నో రకములైనటువంటి శిక్షలు అనుభవించిన తరువాతనే ఇది ఒక చక్కని నగగా తయారవుతుంది. అందరూ విలువైనటువంటి జీవులే, అందరూ భగవంతుని బిడ్డలే! నిప్పు కణములలోపల నిప్పుయొక్క గుణము యేరీతిగా వుంటుందో అదేరీతిగనే దైవముయొక్క బిడ్డలైనటువంటి మానవులందరియందు దైవగుణములు తప్పక ఉంటాయి. కనుక, దైవముయొక్క బిడ్డలైనటువంటి మానవులందరూ సచ్చిదానందస్వరూపులే! అట్టి విశ్వాసమును మనము దృఢము చేసుకోవాలి. ఈ దృఢవిశ్వాసముచేత నెరవేరని పనులొక్కటికూడను వుండవు. లోకములో దేనినైనా సాధించవచ్చును. దానికి నేనే నిదర్శనము. ఎన్ని నిందలో, యెన్ని నిష్ఠూరములో, ఎన్ని విధములైనటువంటి హాస్యాస్పదములో! యెన్ని విధములైనటువంటి ఆటంకములు వచ్చినప్పటికిని వాటిని యెదుర్కొని, ధైర్య, సాహసములచేత చేసే కార్యములు సత్యరూపమైనటువంటివి కనుక యీ విధమైనటువంటివి సాధించుకోవటంచేతనే ఇక్కడ నిలువగలుగుతున్నాను. సాయికి వుండినటువంటి దూషణ, భూషణ, తిరస్కారములు యెవ్వరికిని వుండవు, యీ లోకములో.

**మనోవాక్కాయములను పవిత్రమైన కార్యములలో ప్రవేశింపజేయటమే సాధన**

మనది కానటువంటిదానికై మనము యోచించనవసరములేదు. మనలోలేని దోషములను యెవ్వరు యెన్ని విధములుగా ఎత్తిచూపినప్పటికిని దానికి మనము చింతించనక్కరలేదు. ఇది ప్రకృతియొక్క నైజము. ఎండనీడలు ఒకదానికొకటి వుండినట్టుగా దూషణ భూషణలు రెండూ ఒకదానిప్రక్కనొకటి జంటగా, వెంటగా వుంటున్నాయి. ఎండవుండబట్టే ప్రక్కన నీడ యేర్పడుతున్నది. నీడలో కూడను యెండ వుంటున్నది. కనుక ఈ రెండింటియందు సమత్వము వహించాలి. దివ్యత్వమును లక్ష్యమునందు ఉంచుకోవాలి.

srisathyasaivachanamrutam

మనోవాక్కాయములను పవిత్రమైన కార్యములలో ప్రవేశపెట్టాలి. యిదే యీనాడు ఆచరించవలసినటువంటి ప్రధాన సాధన.

ప్రేమస్వరూపులారా! దైవముయొక్క తత్త్వము మీలో ఆవిర్భవించింది. కేవలము దివ్యాత్మతత్త్వమునుండి ఈ ప్రపంచములో ప్రవేశించినామని భావించ రాదు. లేక ప్రకృతి నుండి ఆత్మలో ప్రవేశిస్తున్నామనికూడను భావించరాదు. ఆత్మ ప్రవేశించునది కాదు, ప్రక్కకు పోవునదీ కాదు. సర్వత్రా వుండునటువంటిది. మన వెంటనే, జంటనే, యింటనే వుండి కంటికిరెప్పవలె కాపాడుతూ వచ్చేటువంటిది యీ ఆత్మతత్త్వము ఒక్కటే! ఈ ఆత్మకు రాకపోకలు లేనటువంటి స్థితి. సర్వసాక్షియైనటువంటి తత్త్వము యీ ఆత్మతత్త్వము. ఇది కేవలము మాటలచేత అర్థమయ్యేదికాదు. ఆచరణచేత, అనుభూతిచేత అందుకోవాలి. ఇలాంటి ఆత్మానందమును అందుకొని మీరు అనుభవించి అభివృద్ధిగావించుకొని జగత్తునకు పంచుతారని ఆశిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

ఈ మూడుదినములలోపల, కాలానుగుణ్యముగా ప్రజలకు ఏవిధమైనటువంటి మార్గములో సహకరించాలి, ఏవిధమైనటువంటి మార్గములో వీరికి బోధించాలి, ప్రజలలో వుండినటువంటి సందేహములు యేవిధముగా నివారణచెయ్యాలి, ఆత్మతత్త్వమనేటువంటిది వారిలో ఏవిధంగా నెలకొల్పాలి, తర్వాత దీనిని యేవిధముగా పోషించాలి అనేటువంటివిషయాలను చక్కగా విచారించి, కేవలము ప్రసంగాలతోనే కాలము వ్యర్థము గావించక శాశ్వతమైన, సత్యమైన, నిత్యమైన తత్త్వాన్ని ప్రచారప్రబోధలు చేయడానికి తగిన అవకాశములను, మార్గములను యీ సమావేశములో నిర్ణయము చేసుకోవాలని నేను ఆశిస్తున్నాను. మన ఆశయాలు దిగ్విజయాన్ని సాధించగలవు. దీనికి యేమాత్రముకూడను సందేహించ నక్కరలేదు. మనము బలహీనులము కారాదు. ఆత్మ విశ్వాసముచేతనే దీనిని సాధించటానికి ప్రయత్నించాలి. ఇకముందు కార్యక్రమములో మీ సమావేశమునకు సంబంధించినటువంటి మహనీయులనేక రకములైనటువంటి ఆదర్శములను అందిస్తారు, ప్రబోధిస్తారు. ప్రబోధించి అందించటమే కాకుండా నూతనమైనటువంటి పద్ధతులుకూడను అభివృద్ధిగావించి మున్ముందు సమాజములోపల

sri sathyasai vachanamrutam

ఆవరించినటువంటి అశాంతిని కొంతవరకు అరికట్టి ఆనందాన్ని అందించాలని నేను యెక్కువగా ఆశిస్తున్నాను.

**(తేదీ 2-1-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam